సాక్షి
అన్నమయ్య జిల్లా
సోమవారం। 17। ఫిబ్రవరి। 2025



### రెవెన్యూ లీలలు ఇంతింత కాదయా.!

పెద్దతిప్పసముద్రం మండలం సంపతికోట పంచాయతీలో రెవెన్యూ అధికారులు ఇష్టారాజ్యంగా ప్రభుత్వ డీకేటీ భూములను ఇతరులకు కట్టబెట్టేశారు. -8లో



### వెంటాడుతున్న చిరుత భయం

పులివెందుల మండల పరిధిలోని తుమ్మలపల్లె గ్రామ సమీపంలో ఆదివారం చిరుత పిల్ల కనిపించినట్లు గ్రామస్తులు తెలిపారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

| | కనిష్టం | గరిష్టం |
|---|---|---|
| మొదటిరకం | రూ.150 | రూ.180 |
| రెండోరకం | రూ.90 | రూ.146 |

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 56 మెట్రిక్ టన్నులు



## న్యూస్‌రీల్

### నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**రాయచోటి:** ప్రజల నుంచి సమస్యలను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు ఈనెల 17వ తేదీన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటితోపాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

### నేడు మల్లయ్యకొండకు ప్రత్యేక బస్సులు

**మదనపల్లె సిటీ:** మాఘమాసం పురస్కరించుకుని తంబళ్లపల్లె వద్ద ఉన్న ప్రముఖ శైవక్షేత్రమైన మల్లయ్యకొండకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు ఆర్టీసీ-1 డిఎం మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం 5.30 గంటలకు, 6.30 గంటలకు మల్లయ్యకొండకు బస్సుల వెళతాయనన్నారు. అక్కడి నుంచి రాగిమాను సర్కిల్ నుంచి మల్లయ్యకొండకు సాయంత్రం వరకు షటిల్ సర్వీసులు నడుస్తాయన్నారు. భక్తులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని కోరారు.

### హ్యాండ్ బాల్ జట్టు ఎంపిక

**కడప వైఎస్ఆర్ సర్కిల్:** కడప నగరంలోని డీఎస్ఎ క్రీడా మైదానంలో ఆదివారం జిల్లా హ్యాండ్ బాల్ ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికలను జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరి శివప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో రాణించాలన్నారు. అనంతరం జిల్లా జట్టుకు ఎంపికలు నిర్వహించారు.

### సీమ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ టోర్నీ విజేత శ్రీకాళహస్తి

**రాజుపాళెం:** రాయలసీమ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో శ్రీకాళహస్తి టీం విజేతగా నిలిచింది. మహా శివరాత్రి పండుగను పురస్కరించుకొని మండల కేంద్రమైన రాజుపాళెం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో రాజుపాళెం కిరణ్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో శని, ఆది వారాల్లో ఈ పోటీలను నిర్వహించారు. ఇందులో భాగంగా విజేత జట్టుకు రూ.15,016లను వీరశంకర్ అందజేశారు. అలాగే రన్నరప్‌గా నిలిచిన నంద్యాల జట్టుకు రూ.12,016 సుభద్రమ్మ అందించగా, మూడవ బహుమతిగా పీలేరు జట్టుకు రూ.10.016 జయరామిరెడ్డి, నాల్గవ బహుమతిగా కోవెలకుంట్ల జట్టుకు 8,016 బాబు సాహెబ్, ఐదవ బహుమతిగా రాజుపాళెం జట్టుకు రూ.5016లతో పాటు మెమెంటోలను లెక్చరల్ జయరాముడు అందించారు.


### రామయ్యకు వెండి కరకం బహూకరణ



వెండి కరకాన్నిఅర్చకులకు అందజేస్తున్న భక్తులు

**ఒంటిమిట్ట:** ఆంధ్రా భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట కోదండరామస్వామికి ఆదివారం సికింద్రాబాద్‌కు చెందిన భక్తుడు వెండి కరకం (చెంబు) బహూకరించారు. సికింద్రాబాద్‌కు చెందిన ఉదయ భాస్కర్ రూ. 89వేలు విలువగల 700 గ్రాముల వెండి కరకాన్ని ఇచ్చారని ఆలయ అధికారులు చెప్పారు. ఆలయ అర్చకులు వీణా మనోజ్ కుమార్, పవన్ కుమార్‌లకు వారు కరకాన్ని అందజేశారు. ఈసందర్భంగా దాతలను ఆలయ అధికారులు సత్కరించారు. అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

### కమనీయం.. రంగనాథుని కల్యాణం



మంగళస్వరూపునిగా సతీసమేత శ్రీరంగనాథుడు

**పులివెందుల టౌన్:** పులివెందుల పట్టణంలోని శ్రీరంగనాథుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీరంగనాథస్వామి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. పండితుల వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ కల్యాణ వైభోగం కన్నుల పండువగా సాగింది. ప్రధాన అర్చకులు కృష్ణరాజేష్ శర్మ ఆధ్వర్యంలో కల్యాణ క్రతువును క్రమంగా నిర్వహించారు. సతీసమేతుడైన శ్రీరంగనాథుని ముగ్ధమోహన రూపాన్ని చూసి భక్తులు తరించారు. శాశ్వత కల్యాణ ఉభయదారులు అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంకు చెందిన చల్లా నారాయణస్వామి, ఉమాదేవి దంపతులు, కుటుంబ సభ్యులచే కళ్యాణం జరిపించారు. సాయంత్రం స్వామివారు సతీ సమేతుడై గజ వాహనంపై పట్టణ పురవీధులలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు కాయకర్పూరాలను సమర్పించారు.

# నిధులిస్తారా.. నీరుగారుస్తారా!

- హంద్రీ-నీవా ప్రాజెక్టు మొత్తానికి రూ.3,500 కోట్లు కేటాయించాలని ప్రతిపాదన
- ప్రాజెక్టు పెండింగ్ పనులకు రూ.729 కోట్లు అవసరం
- 2024-25 బడ్జెట్ బకాయిలకే సరిపెట్టిన ప్రభుత్వం
- కృష్ణాజలాలు పారాలంటే పుష్కలంగా నిధులు ఇవ్వాలి
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ నిధులే కేటాయించే అవకాశం

**బి.కొత్తకోట:** హంద్రీ-నీవా ప్రాజెక్టులోని ప్రధాన కాలువ, ఉపకాలువలు, రిజర్వాయర్లకు కృష్ణా జలాలు పారాలంటే 2025-26 బడ్జెట్‌లో కోరినంత నిధులు ఇవ్వాలి. కరువు రైతుల కల్పతరువైన సాగు, తాగునీటి ప్రాజెక్టుకు కూటమి ప్రభుత్వం పుష్కలంగా నిధులు కేటాయిస్తుందా లేక మొక్కుబడి నిధులతో మొండిచెయ్యి చూపుతుందా, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంజూరు చేసిన నిధులనే కేటాయింపులు చేసి చేతులు దులుపు కుంటుందా అన్నది సర్వత్రా చర్చనీయాంశమైంది. హంద్రీ-నీవా ప్రాజెక్టును పూర్తి చేసి పొలాలకు కృష్ణా జలాలు అందిస్తారన్న ఆశతో రైతులు ఎదురుచూస్తున్నారు. అయితే గత టీడీపీ ప్రభుత్వంలో ఏ ఆర్థిక సంవత్సరంలోనూ అవసరమైనంత నిధులను బడ్జెట్‌లో కేటాయించలేదు. దీంతో పనులు ముందుకు సాగడంలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టు పథకాలను కూటమి ప్రభుత్వం కక్షకట్టి రద్దు చేసేసింది. వారికి అనుకూలమైన పనులు చేపట్టి నిధులను ఇష్టానుసారంగా వినియోగించుకునే వెసులుబాటుతో చర్యలు తీసుకుంటోంది. ఈ నేపథ్యంలో ప్రాజెక్టుకు నిధులు ఆశించినంత ఇస్తారా లేదా అని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

**రూ.3,500 కోట్లు ఇవ్వండి**

హంద్రీ-నీవా ప్రాజెక్టు కర్నూలు, అనంతపురం, చిత్తూరు, వైఎస్సార్ ఉమ్మడిజిల్లాల్లో సాగుతుంది.



తంబళ్లపల్లి నియోజకవర్గంలో ప్రధాన కాలువ అసంపూర్తి పనులు

ఈ ప్రాజెక్టు పరిధిలో జరుగుతున్న, చేపట్టబోయే పనులకు రూ.3,500 కోట్లు కేటాయించాలని ప్రభుత్వానికి బడ్జెట్ ప్రతిపాదనలను ఉన్నతాధికారులు పంపారు. ప్రస్తుతం అనంతపురం జిల్లాలో కాలువ వెడల్పు చేయడం, కొన్ని కాంక్రీటు, మట్టి పనులు రూ.1,240 కోట్లతో చేపట్టారు. ఇదికాక ప్రధాన కాలువకు సంబంధించి మరో రూ.503 కోట్లతో పనులు సిద్ధం చేశారు. ఈ మొత్తం పనులకే రూ.1,700 కోట్లు కావాలని నివేదించారు. ఇవికాక కర్నూలు జిల్లాకు రూ.450 కోట్లు పోను, మిగిలిన రూ.1,350 కోట్లు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పనులను ఈ నిధులతో చేపట్టాల్సి ఉంటుంది.

**ఉమ్మడి చిత్తూరుకు రూ.2 వేల కోట్లు కావాలి**

విభజిత అన్నమయ్య, చిత్తూరుజిల్లాల్లో ప్రాజెక్టు పనులు పూర్తి కావడానికి ఇంచుమించు రూ.2 వేల కోట్లు అవసరం అవుతాయి. ఇందులో ప్రాజెక్టులో అసంపూర్తి పనులు చేపట్టి పూర్తి చేసేందుకు రూ.729 కోట్లు అవసరం ఉందని అధికారిక నివేదిక చెబుతోంది. ప్రాజెక్టులో భాగమైన ఉపకాలువలు, డిస్ట్రిబ్యూటరీల కాలువలు, స్ట్రక్చర్స్‌లో పెండింగ్‌లోని పనులు పూర్తి చేయాల్సి ఉంది. ఈ నిధుల్లో రూ.250 కోట్లతో ప్రధానకాలువపై చిన్నమండెం మండలం పడమటికోన, కలకడ వద్ద కాలువ తవ్వకం, 12 చోట్ల కాంక్రీటు నిర్మాణాలు పెండింగ్‌లో ఉన్నాయి. ఇవి పూర్తి చేస్తే కానీ అడవిపల్లె, శ్రీనివాసపురం రిజర్వాయర్లకు కృష్ణా జలాలు వెళ్లవు. ఈ రూ.250 కోట్ల నిధులకు ప్రభుత్వం నుంచి ఇంకా ఆమోదం లభించలేదు.

### ▶▶ బకాయిలకే గత బడ్జెట్

2014-15 బడ్జెట్‌లో ప్రభుత్వం ప్రాజెక్టుకు రూ.611 కోట్లు కేటాయించింది. ఈ నిధులతో పనులు జరగడం కంటే బకాయిల చెల్లింపుకే సరిపోయింది. ఇప్పటిదాకా రూ.400 కోట్లు చెల్లించగా మిగిలిన నిధులతో మరోనెలలో జరిగే అభివృద్ధి పనులు పెద్దగా ఉండకపోవచ్చు. పెండింగ్ బిల్లుల విషయానికి వస్తే.. మదనపల్లి సర్కిల్‌లోనూ ఉన్నాయి. ఇవికాక ఎత్తిపోతల పథకాల కోసం వినియోగించిన విద్యుత్‌కు రూ.4 వేల కోట్ల మేరకు బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ ఏడాదిలో రూ.450 కోట్ల మేర చెల్లించగా వచ్చే బడ్జెట్‌లో రూ.వెయ్యి కోట్లు ఇవ్వాలని ప్రభుత్వానికి బడ్జెట్ ప్రతిపాదనలో కోరారు.

### ▶▶ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ నిధులే ఇస్తారా?



2015-26 బడ్జెట్ కేటాయింపు విషయంలో కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంజూరు చేసి, వినియోగించుకోని నిధులను మిగులుగా చూపిస్తోంది. ఇవే నిధులను కొత్త బడ్జెట్‌లో కేటాయించే అవకాశం లేకపోలేదు. పుంగనూరు ఉపకాలువ (పీబీసీ) విస్తరణ పనులకు 2020లో సీఎం వైఎస్.జగన్ నిధులు మంజూరు చేయగా రూ.1,217 కోట్లతో కాంట్రాక్టర్‌కు పని అప్పగించి ఒప్పందం చేశారు. తాజాగా కూటమి ప్రభుత్వం ఈ కాలువకు రూ.480 కోట్లతో లైనింగ్ పని చేపట్టింది. దీనికి సంబంధించి జారీ చేసిన జీవోలో రూ.1,217 కోట్ల పనిలో మిగులు నిధులు ఉన్నాయని, వాటిలో రూ.480 కోట్లతో లైనింగ్ పనులకు నిధులు మంజూరు చేస్తున్నట్టు స్పష్టంగా పేర్కొంది. అంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంజూరు చేసిన వాటిల్లో ఇంకా రూ.1,177 కోట్లు మిగులు నిధులు అందుబాటులో ఉన్నట్టు లెక్క.కుప్పం రిజర్వాయర్ల కోసం మంజూరు చేసిన మరో రూ.535 కోట్లు వినియోగించుకోలేదు కాబట్టి ఈ నిధులను మిగులుగా చూపవచ్చు. కాబట్టి ఎలా చూసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంజూరు చేసిన నిధులే వచ్చే బడ్జెట్‌లో కేటాయింపు ఉండొచ్చన్నది స్పష్టం అవుతోంది.

### ▶▶ లైనింగ్‌కే రూ.684 కోట్లు

పుంగనూరు ఉపకాలువ వెడల్పు పనులను రద్దు చేసిన కూటమి ప్రభుత్వం కాలువకు లైనింగ్ పనులకు ప్రాధాన్యత ఇచ్చింది. ఇందులో ప్రస్తుత అన్నమయ్య జిల్లాలోని పెద్దతిప్పసముద్రం మండలం నుంచి చిత్తూరుజిల్లాలోని పెద్దపంజాణి మండలం వరకు పుంగనూరు ఉపకాలువకు లైనింగ్ పనులను రూ.480 కోట్లతో, పెద్దపంజాణి నుంచి కుప్పం వరకు కుప్పం ఉపకాలువకు రూ.204 కోట్లతో లైనింగ్ పనులను చేపట్టారు. ఇదికాక కుప్పం కాలువకు సంబంధించి ఇంకా రూ.59 కోట్ల పనులు జరగాల్సి ఉంది. ప్రభుత్వం చెబుతున్నట్టు ఆరునెలల్లో ఈ లైనింగ్ పనులు పూర్తి జరగాలంటే బడ్జెట్‌లో పూర్తిస్థాయిలో నిధులు కేటాయించాలి. ఇప్పటికే కృష్ణా జలాల తరలింపుని నిలివేసిన ప్రభుత్వం లైనింగ్ పనులకు నిధులు ఇవ్వకుంటే రైతులు నష్టపోవాల్సి వస్తుంది. కాగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కుప్పానికి రూ.535 కోట్లతో యామిగానిపల్లె వద్ద 0.7 టీఎంసీలు, మాదనపల్లె వద్ద 0.3 టీఎంసీలతో రిజర్వాయర్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. వీటిని సద్వినియోగం చేసుకుని బడ్జెట్‌లో అనుమతి ఇస్తారో లేదో చూడాలి.



పెద్దతిప్పసముద్రంలో పుంగనూరు ఉపకాలువకు లైనింగ్ పనులు

# మన మార్పు.. వారికి నేర్పు!

**పరీక్షల వేళ తల్లిదండ్రులదే కీలకపాత్ర**



చదువుకుంటున్న పదో తరగతి విద్యార్థులు

**మదనపల్లె సిటీ:** పబ్లిక్ పరీక్షలు సమయం దగ్గరపడుతోంది. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులపై ఒత్తిడి ఉంటుంది. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు పిల్లల దైనందిక జీవితంలో మార్గదర్శకులుగా మారడం అవసరం. వారి చదువుకు అనువైన వాతావరణం కల్పించాలి. జిల్లాలో మరో నెల రోజుల్లో పదోతరగతి, 15 రోజుల్లో ఇంటర్మీడియట్ పరీక్షలు జరగనున్నాయి. పరీక్షల వేళ తల్లిదండ్రులు తమ జీవనశైలిలో కొన్ని మార్పులు చేసుకోవాల్సిన అవసరం ఉంది.

**ఆరోగ్యంపై శ్రద్ధ**

జంక్‌ఫుడ్, నూనె పదార్థాలు, మసాలా ఆహారం తినకుండా నిలవరించాలి. ఇంట్లోనే షోషకాలు అందే ఆహారం సమకూర్చాలి. పెద్దలు వీటిని ఆహారంలో తీసుకోకుంటే పిల్లలకు అలవాటు అవుతుంది.

**సెల్‌ఫోన్‌కో నియమం:** పిల్లలు చదువుకునే సమయంలో పెద్దలు సెల్‌ఫోన్ చూస్తూ లేదా మాట్లాడుతూ కాలక్షేపం చేస్తుంటారు. దీంతో వారి ఏకాగ్రత సెల్‌ఫోన్‌పై మళ్లే అవకాశం ఉంటుంది. అవసరం మేరకే వారి ముందు ఫోన్ ఉపయోగించాలి.

**ఒత్తిడికి దూరం..**

చాలా సమయం వృథా చేస్తున్నావ్ అని పిల్లలను దబాయించకూడదు. ఇది మరింత ఒత్తిడికి గురయ్యేలా చేస్తుంది. ఒక్కో సారి తల్లిదండ్రులు వారి పని ఒత్తిడిని ఇంట్లో ప్రదర్శిస్తుంటారు. ఇది పిల్లల చదువుపై ప్రభావం చూపిస్తుంది.

**అనువైన వాతావరణం**

పిల్లలను చదవమని చెప్పి ఇంట్లో టీవీల్లో పెద్ద శబ్దాలు పెట్టడం, బయట వ్యక్తులతో పిచ్చాపాటి చర్చలు పెట్టడం వంటివి మానుకోవాలి. ప్రశాంత వాతావరణం కల్పిస్తే పుస్తకాలపై దృష్టి సారిస్తారు.

**మత్తుకు దూరం:** పరీక్షల సమయంలో మత్తుకు దూరంగా ఉండటంతో పాటు పిల్లలోనూ మత్తు, సిగరెట్, గుట్కా వంటివేమైనా అలవాటుందా గుర్తించి వాటి బారి నుంచి తప్పించడానికి ప్రయత్నించాలి.

**కుటుంబ మద్దతుతోనే విజయం**



విద్యార్థుల విజయం వెనుక తల్లిదండ్రులదే కీలకపాత్ర. వార్షిక పరీక్షల సమయంలో ఇంట్లో కొన్ని మార్పులు చేసుకోవడంతో వారిలో బాధ్యత పెరుగుతుంది. పిల్లలపై ఒత్తిడి చేసినట్లు కనిపించరాదు. అప్పుడే అనుకున్న లక్ష్యం చేరుకుంటారు. -బాలకృష్ణమూర్తి, ప్రిన్సిపాల్, బాలికల జూనియర్ కాలేజీ, మదనపల్లె

**విజయానికి మెట్టులాంటిది**



విద్యార్థుల విజయానికి తల్లిదండ్రుల పాత్ర మెట్టులాంటిది. వారు పిల్లల నడవడికను గమనిస్తూ ఉండాలి. వారితో స్నేహపూర్వకంగా మెలగాలి.మంచి,చెడులను పంచుకోవాలి. వారిపై ఒత్తిడి పెంచకుండా ఉంటే అనుకున్న లక్ష్యం సాధిస్తారు. -చాముండేశ్వరి, సైకాలజిస్టు, మదనపల్లె

భారతామృతాన్ని పంచిన

# ప్రజ్ఞానిధి 'భూతపురి'

**కడప కల్చరల్ :** మహాభారతమనే అమృతాన్ని అందరికీ పంచి పెట్టిన మహాకవి భూతపురి సుబ్రహ్మణ్యశర్మ ప్రజ్ఞానిధి అని వక్తలు కొనియాడారు. డాక్టర్ భూతపురి సుబ్రహ్మణ్య శర్మ స్మారక ట్రస్టు, అల్లసాని పెద్దన సాహిత్య పీఠంతో కలిసి ఆదివారం స్థానిక సీపీ బ్రౌన్ గ్రంథాలయంలో భూతపురి 88వ జయంతి సందర్భంగా 23వ సాహిత్య పురస్కారాన్ని రిటైర్డ్ ఇంజనీర్ పుత్తా పుల్లారెడ్డికి ప్రదానం చేశారు. తొలుత డాక్టర్ భూతపురి చిత్రపటానికి పూలమాల అలంకరించి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభకుప్రముఖ సాహితీవేత్త ఆచార్య శలాక రఘునాథ శర్మ ప్రధాన వక్తగా హాజరై మాట్లాడారు. భూతపురి సుబ్రహ్మణ్యశర్మ సాహిత్యంలో అనితర సాధ్యమైన కృషి చేసిన మహా రుషియని అభివర్ణించారు. అలాంటి మహాకవి పేరిట ఏర్పాటు చేసిన స్మారక పురస్కారాన్ని పుత్తా పుల్లారెడ్డి లాంటి సాహితీ వేత్తకు ఇవ్వడం సమంజసంగా ఉందన్నారు. సత్కార గ్రహీత పుత్తా పుల్లారెడ్డి మహాభారతాన్ని ఔపోసన పట్టిన వాంగ్మయ తపస్వి అని అభివర్ణించారు. డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ కులపతి ఆచార్య విశ్వనాథ కుమార్, యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కృష్ణారెడ్డి , ఆకాశవాణి పూర్వ డైరెక్టర్ ఆకుల మల్లేశ్వరరావు, తిరుపతికి చెందిన డాక్టర్ పెనుబాల చంద్రశేఖర్ , వైవీయూ పాలకమండలి సభ్యులు ఆచార్యమూల మల్లికార్జునరెడ్డి , బ్రౌన్ కేంద్రం సంచాలకులు ఆచార్య పార్వతి తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా డాక్టర్ భూతపురి సుబ్రహ్మణ్య శర్మ సాహిత్య పురస్కారాన్ని పుత్తా పుల్లారెడ్డికి అతిథులతో కలిసి అందజేస్తూ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ భూతపురి కుటుంబ సభ్యులు, పుత్తా సోదరుల కుటుంబ సభ్యులు, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.





పుత్తా పుల్లారెడ్డికి పురస్కార ప్రదానం

# రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య

- ప్రత్యేక యాప్‌ద్వారా నమోదు
- పథకాలకు ఇదే ఆధారం

**రాజంపేట రూరల్:** రైతులకు డిజిటల్ గుర్తింపు సంఖ్య(విశిష్టగుర్తింపు సంఖ్య)ను ఇచ్చే ప్రక్రియకు కేంద్రప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఆధార్‌కార్డుతో గుర్తింపు ఇచ్చినట్లుగా ప్రతి రైతుకు 11 అంకెలు కలిగిన యూనిక్ ఐడీ నెంబర్‌తో కూడిన ప్రత్యేక గుర్తింపు కార్డులను ఇవ్వనుంది. ఇందులో భాగంగా రైతులకు రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయశాఖ సహాయకుల ద్వారా ఫార్మర్స్ రిజిస్ట్రీ(ఎఫ్ఆర్) పోర్టల్లో రైతుగా నమోదు ప్రక్రియ ప్రారంభించింది.వ్యవసాయశాఖ నోడల్ డిపార్ట్‌మెంట్‌కు ఈ నమోదు బాధ్యతలను అప్పగించారు. జిల్లాలో మొత్తం 3,52,873 మంది రైతులు ఉండగా వీరిలో పీఎం కిసాన్‌కు సంబంధించి 1,83,659 మంది ఉన్నారు. వీరిలో 15వ తేదీకల్లా 30 శాతం మేరకు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. రైతులకు ఈ ప్రత్యేక గుర్తింపు సంఖ్యను ఇవ్వడం ద్వారా వ్యవసాయ సేవలను సులభతరం చేసి పథకాలను పారదర్శకంగా అందుబాటులోకి తీసుకురావడమే ముఖ్య ఉద్దేశం.







గుండ్లూరు రైతు సేవా కేంద్రంలో విశిష్టనంబర్ నమోదు పక్రియ కోసం వచ్చిన రైతులు

**నమోదుకు అవసరమైన ధ్రువ పత్రాలు:** రైతు ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్, వన్‌బీ, ఆధార్ కార్డుకు లింక్ అయిన మొబైల్ నెంబర్‌ను రైతు సేవా కేంద్రానికి తీసుకెళ్తారు. రైతు మొబైల్ ఫోన్‌కు మూడు ఓటీపీలు వస్తాయి, ఆ ఓటీపీలను వ్యవసాయ సిబ్బందికి తెలియచేస్తే రైతు యూనిక్ ఐడీ దరఖాస్తు ప్రక్రియ పూర్తవుతుంది.

**రైతుకు ఒనగూరే ప్రయోజనాలు**

ఆధార్ మాదిరిగా యూనిక్ కోడ్‌తో జారీ చేసే ఈ కార్డులతో రైతులకు ఐడీ కార్డుగా ఉపయోగపడుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే అన్ని పథకాలను రైతుల యూనిక్ కోడ్‌తో అనుసంధానం చేస్తారు. రానున్న రోజుల్లో ఈ యూనిక్ నంబర్ ఉన్న రైతులకు వ్యవసాయ పథకాలు, ఎరువులు, పంటల బీమా అందుతాయని అధికారులు అంటున్నారు. అలాగే ఈ యూనిక్ నబబర్‌ను ఉపయోగించి కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా బ్యాంకు లింక్‌తో కూడిన సేవలు పొందవచ్చు. దేశంలో ఎక్కడి నుంచైనా రైతుల రుణ అర్హత, రుణ బకాయిలు, ప్రభుత్వ పథకాలు వివరాలను సులభంగా తెలుసుకోవచ్చు. దీంతోపాటు పంటలకు కనీస మద్దతు ధర పొందేందుకు ఈ కార్డులు ఉపయోగపడతాయి. వీటితో పాటు ఇతర సేవలైన నీటి పారుదల, తెగుళ్ల నియంత్రణ, వాతావరణ సూచనలు వంటి సేవలు కూడా పొందేందుకు వీలవుతుంది.

**నమోదు చేసుకోవాలి**



రైతులు ఫార్మర్ రిజిస్ట్రీలో పేరు నమోదు చేసుకోవాలి. లేకుంటే ప్రభుత్వాలు అందించే ప్రయోజనాలు కోల్పోతారు. భూమి వివరాలు ఆన్‌లైన్‌లో లేకుంటే ఫార్మర్ రిజిస్ట్రీలో రైతు పేరు నమోదు కాదు. రైతులు ఆన్‌లైన్ చేయించుకుని ఎఫ్ఆర్‌లో నమోదు కావాలి. -జీ.రమేష్‌బాబు, డివిజనల్ సహాయ వ్యవసాయ సంచాలకులు, రాజంపేట

జిల్లాలోని రైతుల వివరాలు

| నియోజకవర్గం | రైతులు |
|---|---|
| రాజంపేట | 29,839 |
| రైల్వేకోడూరు | 23,930 |
| రాయచోటి | 36,357 |
| తంబళ్లపల్లి | 37,684 |
| మదనపల్లి | 19,430 |
| పీలేరు | 36,419 |
| మొత్తం | 1,83,659 |

## క్లుప్తంగా

### హార్సిలీ ఘాట్‌లో బైక్ ప్రమాదం

బి.కొత్తకోట : మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ పైనుంచి కిందకు వస్తున్న బైక్ ప్రమాదానికి గురికావడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడిన ఘటన ఆదివారం మధ్యాహ్నం జరిగింది. స్థానికుల కథనం మేరకు వివరాలు. బైక్‌పై ఓ యువతి, యువకుడు హార్సిలీహిల్స్ వచ్చారు. కొండపై పర్యటన ముగించుకుని వెనుదిరిగారు. ప్రొద్దుటూరు మలుపు దాటుకున్న తర్వాత బైక్ ప్రమాదానికి గురైంది. అతివేగంతో వచ్చిన కారణంగా అదుపుతప్పింది. ఈ ప్రమాదంలో యువతి, యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి.

### బెరైటీస్ మిల్లులను ఆదుకోండి

ఓబులవారిపల్లి : మంగంపేట గనుల ఆధారంగా ఏర్పాటు చేసుకున్న బెరైటీస్ మిల్లులను ఆదుకోవాలని, అందులో పనిచేస్తున్న కార్మికులను కాపాడాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్, పోరాట కమిటీ కన్వీనర్ పి.జాన్ ప్రసాద్ కోరారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ మంగంపేట గనుల్లో ముగ్గురాయి ఆధారితంగా స్థానికంగా 175 పల్వరైజింగ్ మిల్లులను ఏర్పాటు చేశారన్నారు. అందులో పనిచేస్తున్న కార్మికులకు ప్రత్యేకమైన రాయితీలు కల్పించకుండా సి అండ్ డి గ్రేడ్ టన్ను రూ. 1680 ఇస్తామని చెప్పడం అన్యాయమన్నారు. ఎగుమతిదారులకు ధర తగ్గించి రూ. 1188 ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వం స్థానిక పల్వరైజింగ్ మిల్లులకు రూ. 500 ధర పెంచి ఇస్తానని చెప్పడం, ఒకరికి ఒక ధర ఇంకొకరికి మరో ధర ఇవ్వడంలో ఆంతర్యమేమిటని నిలదీశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో మిల్లులకు 40 శాతం, ఎగుమతి దారులకు 60 శాతం ముడి ఖనిజాన్ని సరఫరా చేసే విధంగా అప్పట్లో జీఓ నంబర్. 296 ఇచ్చారని, దానిని అమలు చేయాలని కోరారు.

### ఆటోను ఢీ కొన్న ట్రాక్టర్

కమలాపురం : పట్టణ పరిధిలోని మార్కెట్ యార్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని జీవంపేటకు చెందిన షేక్ పీరా వలి తీవ్రంగా గాయపడ్డాడు. 108 సిబ్బంది తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. పీరావలి ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి కమలాపురం పట్టణం నుంచి క్రాస్ రోడ్డుకు పీరా వలి తన ఆటో నడుపుతూ వస్తున్న క్రమంలో హెచ్‌పీ పెట్రోల్ బంక్ దాటిన తర్వాత మార్కెట్ యార్డులో నుంచి వచ్చిన ట్రాక్టర్ ఆటోను ఢీ కొంది. ఈ ఘటనలో పీరావలి తీవ్రంగా గాయపడ్డాడు. అలాగే ఆటో కూడా దెబ్బతిన్నది. స్థానికులు 108కు సమాచారం అందించగా వల్లూరు 108 వాహనం ద్వారా కడపలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

### ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరం సరోజినీ నగర్‌కు చెందిన వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు రిమ్స్ సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. ఆయన వివరాల మేరకు సరోజినీ నగర్‌లో నివాసం ఉంటున్న షేక్ షబ్బీర్(35) టైల్స్ పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. గత కొన్ని సంవత్సరాలుగా మద్యానికి బానిసయ్యాడు. కూలి డబ్బులు ఇంట్లో ఇవ్వకుండా తాగుతూ ఉండేవాడు. ఈ నేపథ్యంలో శనివారం అర్ధరాత్రి అందరూ నిద్రిస్తున్న సమయంలో ఉరివేసుకున్నాడు. మృతుడి భార్య షకీలా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

**విష ద్రావణం తాగి వృద్ధురాలు..**

కడప నగరం సరోజిని నగర్‌కు చెందిన ఓ వృద్ధురాలు ఆదివారం విషద్రావణం తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు రిమ్స్ సీఐ సీతారామిరెడ్డి తెలిపారు.

# రెవెన్యూ లీలలు ఇంతింత కాదయా.!

- హక్కుదారుల నోట్లో మట్టి కొట్టి.. ఇతరులకు కట్టబెట్టి
- సంపతికోటలో భూ మాయాజాలం
- కర్ణాటక వాసుల పేరిట కూడా డీకేటీ భూముల మార్పిడి



ఈ ఫోటోలో ఉన్న వ్యక్తి పేరు మహబూబ్‌పీర్. ఇతని అవ్వ హజీరాబీ పేరిట 278 సర్వే నంబర్‌లో 4.85 ఎకరాల డీకేటీ భూమి ఉండగా ఆమె అనంతరం సదరు భూమికి ఇతనే వారసుడు. అయితే సదరు భూమి శాంతమ్మ పేరిట రికార్డుల్లో నమోదైంది. ఈమె కర్ణాటక రాష్ట్రం కొత్తుడియంకు చెందిన మహిళగా బాధితుడు పేర్కొన్నాడు.



శాంతమ్మ పేరిట ఉన్న వన్‌బీ

పెద్దతిప్పసముద్రం : మండలంలోని సంపతికోట పంచాయతీలో రెవెన్యూ అధికారులు ఇష్టారాజ్యంగా ప్రభుత్వ డీకేటీ భూములను ఇతరులకు కట్టబెట్టేశారు. పట్టాలు ఉండి సాగు చేస్తున్న హక్కుదారుల నోట్లో మట్టి కొట్టి కర్ణాటక రాష్ట్రంలో, పక్క మండలాల్లో ఉంటున్న వారి పేరిట డీకేటీ భూములు కట్టబెట్టారంటే అధికారులు ఎంతగా బరి తెగించారో ఇట్టే అర్థమౌతోంది. విషయం తెలుసుకున్న హక్కుదారులు లబోదిబోమంటూ మొత్తుకుంటున్నారు. రూ.లక్షల్లో డబ్బులు తీసుకుని అధికారులు తమ భూములను ఇష్టారాజ్యంగా మార్పిడి చేశారని రైతుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా, సబ్ కలెక్టర్ ఆదేశాలను సైతం బే ఖాతర్ చేస్తూ అధికారులు మామూళ్లు తీసుకుని ఒకరి భూమిని మరొకరి పేరిట మార్చేశారని హక్కుదారులు వాపోతున్నారు. రెవెన్యూ అధికారులు ఒక్క సంపతికోట పంచాయతీలోనే వందల ఎకరాల ప్రభుత్వ భూముల రికార్డులు తారుమారు చేసినట్లు తెలుస్తోంది. జిల్లా ఉన్నతాధికారులు సమగ్రంగా రికార్డులు తనిఖీ చేస్తే అధికారుల అవినీతి బండారం బట్టబయలు అవుతుందని పంచాయతీ ప్రజలు పేర్కొంటున్నారు.

■ ఇదే పంచాయతీలోని కానగమాకులపల్లికి చెందిన చిన్న వెంకట్రాయప్పరెడ్డి పేరిట సర్వే నంబర్ 459/1లో 4.25 ఎకరాల డీకేటీ భూమి ఉండగా ఆయనకు తెలియకుండా ఆయన బతికుండగానే అతని భార్య సిద్దమ్మ పేరిట భూ మార్పిడి ఎందుకు చేశారో అధికారులకే ఎరుక.

■ వడ్డి కోనప్ప అనే వ్యక్తి పేరిట ఉన్న సర్వే నంబర్ 443/2లో 3.78 ఎకరాల డీకేటీ భూమి ఉండగా సదరు భూమి తన అనంతరం మనవరాలు కవితకు చెందేలా వీలునామాలో పేర్కొన్నాడు. అయితే ఆయన మరణానంతరం సదరు భూమిని అతని వారసులు, కుటుంబ సభ్యులకు కాకుండా పక్కనే ఉన్న బి.కొత్తకోట మండలంలోని వెంకటలక్ష్మి అనే మహిళ పేరిట ఎందుకు బదలాయించారో అర్థం కావడం లేదు.

■ కురాకుల లక్ష్మీదేవమ్మ పేరిట సర్వే నంబర్ 557/2లో 5 ఎకరాలు, కురాకుల గుర్రప్ప పేరిట సర్వే నంబర్ 557/3లో 3.60 ఎకరాల డీకేటీ భూమి వారి అధీనంలో ఉంది. ఇటీవల వన్‌బీ కోసం సచివాలయానికి వెళ్లారు. సదరు భూమి బి.కొత్తకోటలో కాపురం ఉంటున్న ఇద్దరు వ్యక్తుల పేరిట ఉండటం చూసి హక్కుదారులు నివ్వెరపోతున్నారు.

**సమస్యలను పరిష్కరిస్తాం**

ఈ మధ్య కాలంలో నా దృష్టికి కూడా ఇలాంటి సమస్యలు వస్తున్నాయి. ఇవి ఎప్పుడు జరిగాయో నాకు తెలియదు. బాధిత రైతులు సమగ్రమైన ఆధారాలతో దరఖాస్తు చేసుకుంటే రికార్డులు పరిశీలించి మార్పులు, చేర్పులు చేస్తాం.

-శ్రీరాములు నాయక్, తహసీల్దార్

# బీసీల సంక్షేమానికి పెద్దపీట

మంత్రి రాంప్రసాద్‌రెడ్డి



బీసీ సంక్షేమ సంఘం నాయకులతో కలిసి పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం బీసీల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖమంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని అజయ్ కన్వెన్షన్ హాల్‌లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బీసీ మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు బీసీల పక్షపాతిగా పనిచేస్తూ బీసీల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో బీసీలకు పార్టీతో పాటు ప్రజాప్రాతినిధ్య పదవులలో అత్యంత ప్రాధాన్యత ఇస్తామన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగల్‌రావు, కన్వీనర్ ఆవుల నరసింహారావు, ప్రధాన కార్యదర్శి బడిగించల చంద్రమౌళి, జిల్లా అధ్యక్షురాలు పద్మ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## దేవదాయశాఖ అధికారులను అడ్డుకున్న పద్మశాలీలు

ఒంటిమిట్ట : మండల పరిధిలోని కొత్తమాధవరంలో 32 సంవత్సరాల క్రితం గ్రామస్తులు భద్రావతి భావ నారాయణస్వామి ఆలయాన్ని నిర్మించుకున్నారు. ఈ ఆలయం ఇప్పుడు దేవదాయశాఖ ఆధీనంలో ఉందంటూ బోర్డు నాటే ప్రయత్నం చేసిన ఎండోమెంట్ అధికారులను ఆదివారం గ్రామంలోని పద్మశాలీలు అడ్డుకున్నారు. దీనిపై ఆలయ ధర్మకర్త కేసీఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ గ్రామ పెద్దలకుగానీ, కమిటీ సభ్యులకు గానీ ఎలాంటి సమాచారం ఇవ్వకుండా దేవదాయశాఖ అధికారులు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కొండారెడ్డి, ఇన్‌స్పెక్టర్ జనార్దన్‌లు ఉన్నట్లుండి ఆదివారం అనధికారికంగా వచ్చి ఆలయం దేవదాయశాఖ ఆధీనంలో ఉందంటూ బోర్డునాటే ప్రయత్నం చేశారు. ఈ ప్రయత్నాన్ని పద్మశాలీలు అడ్డుకున్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎస్.వి.కృష్ణయ్య, పన్నెల చంద్రశేఖర్, బోగా శంకరయ్య, పోలిచెర్ల శ్రీనివాసులు, పద్మశాలీల ప్రెసిడెంటు బోడిగల అనంతరామయ్య తదితరులు పాల్గొన్నారు. కాగా, ఈ ఆలయం ఎప్పటి నుంచో దేవదాయ శాఖ ఆధీనంలో ఉందని దేవదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ అధికారి కొండారెడ్డి తెలిపారు. బుధవారం వరకు గ్రామస్తులకు సమయం ఇచ్చామని, ఆ తర్వాత ప్రభుత్వ నిర్ణయం మేరకు బుధవారం ఆలయాన్ని దేవదాయ శాఖ ఆధీనంలోకి తీసుకుంటామన్నారు.



దేవదాయశాఖ అధికారులను ప్రశ్నిస్తున్న పద్మశాలీలు

# అరుదైన ప్రపంచ తత్వవేత్త జిడ్డు కృష్ణమూర్తి

నేడు వర్ధంతి

కురబలకోట : జిడ్డు కృష్ణమూర్తి.. ఈపేరు ఇప్పటి తరం వారికి పెద్దగా తెలియకపోవచ్చు. అయితే ప్రపంచ వ్యాప్తంగా వినుతికెక్కారు. ఆధ్యాత్మిక, దార్శనిక, తాత్విక వేత్త. ఆయన ఫిలాసఫీ ఎందరినో కదిలించింది. జాతి, మత, దేశ, రాజకీయ ఆదర్శాలకు అతీతంగా విద్యార్థులకు విద్య నందించడమే నూతన ప్రపంచానికి మార్గమన్నారు. సత్యాన్వేషణ తోనే జ్ఞానోదయం అని చాటి చెప్పిన ప్రపంచ తత్వవేత్తగా ఖ్యాతి గడించారు. ఆయన జీవిత విశేషాలు ఆసక్తిని రేకెత్తిస్తాయి. మదనపల్లెలో పుట్టిన వాడిగా ఆయనలా ఇప్పటి వరకు ప్రపంచ వ్యాప్తంగా పేరు ప్రఖ్యాతులు తెచ్చుకున్నవారు లేరు. మదనపల్లెలో పుట్టి మద్రాస్ అడయార్‌లో పెరిగి ఆపై ప్రపంచ మాస్టర్‌గా ఎదిగారు. 60 ఏళ్లకు పైగా పలు దేశాలు పర్యటించారు. జీవన సందేశాన్ని వినిపించారు. విప్లవాత్మకమైన జీవన తాత్వికతను ప్రపంచానికి అందించారు. ప్రధానంగా సత్యాన్ని తెలుసుకోవడానికి దారులు లేవు. ఎవరికి వారు అన్వేషించి తెలుసుకోవాలన్నారు. ఎవరినో ఆదర్శంగా తీసుకోవడం కన్నా నిన్ను నీవు తెలుసుకోవడం వల్ల సత్యాన్ని తెలుసుకోగలవన్నారు. సాంప్రదాయ విద్య కన్నా స్వతంత్ర ఆలోచన కలిగించే విద్య మనిషిని మేల్కొలుపుతుందన్నారు. సిద్ధాంతాలకు కట్టుబడి ఉండరాదన్నారు. మనిషిని పరిపూర్ణుడిగా చేయడమే విద్య కర్తవ్యమని బోధించారు. విద్యార్థి నిరంతరం నేర్చుకునే వాడిగా ఉండాలి. టీచర్ విద్యార్థిలోని సృజనాత్మకతను తట్టి మేల్కొలిపేలా ఉండాలి. మనసు నిండా ప్రేమను నింపుకున్న వారు మంచి తప్పు చెడు చేయలేరు. మనిషి సంపూర్ణుడిగా ఎదగాలని పదేపదే చెప్పారు. పదవులను ఆయన తృణప్రాయంగా ఎంచారు. ఇప్పటి తరం వారు చిన్న పదవి లభిస్తే వదలమన్నా వదలరు. ఆపై నానా పైరవీలు చేస్తారు. అనిబిసెంట్ అప్పట్లో ఆయన్ను ప్రపంచానికి జగద్గురువును చేయాలని ఆర్డర్ ఆఫ్ ది స్టార్ అనే అంతర్జాతీయ సంస్థకు అధినేతను చేశారు. అది నచ్చక 1926లో రద్దు చేయడంతో పాటు ఏకంగా దాని నుంచి వైదొలిగారు. వందల కోట్ల ఆస్తిని వదులుకున్నారు. అప్పట్లో యావత్ ప్రపంచమే విస్తుపోయింది. మానసిక విప్లవం, మనోభావ విచారణపై ఎన్నో ప్రసంగాలు చేశారు. ఎవరికి వారు మార్పు చెందాలన్నారు. మూఢ నమ్మకాల నుంచి విముక్తి పొందాలనేవారు. 1895 మేలో జన్మించిన ఆయన 1986 ఫిబ్రవరి 17న శాశ్వత నిద్రలోకి వెళ్లారు. కృష్ణమూర్తి ఫౌండేషన్ (కేఎఫ్ఐ) పేరిట దేశ విదేశాల్లో విద్యాలయాలు నడుస్తున్నాయి. 1925లో సోదరుడు నిత్యానంద ఆకస్మిక మరణం ఆయనలో ఎనలేని మార్పునకు దారి తీసింది. జిడ్డు కృష్ణమూర్తి పుస్తకాలు పలు భాషల్లోకి అనువాదమయ్యాయి. ప్రసంగాలు కోట్ల మందిని కదిలించడంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా ఎందరినో ప్రభావితం చేసిన ఆయన మన తెలుగు వాడు కావడం మనందరికీ గర్వకారణం. ఆధునిక తత్వవేత్తలలో ఆద్యుడిగా, ప్రపంచ జ్ఞానిగా పేరు గడించారు. ప్రపంచానికి భారత దేశం అందించిన గొప్ప మహోన్నతుడిగా, విశ్వ మానవుడిగా జిడ్డు కృష్ణమూర్తిని యావత్ ప్రపంచం కొనియాడుతోంది.



"ప్రపంచం మొత్తం నీలోనే ఉంది. ఎలా చూడాలో తెలిస్తే దాన్ని తెరిచే తలుపు ఇక్కడే ఉంది. కానీ ఆ తలుపు తెరిచే తాళం మాత్రం ఎవరూ ఇవ్వలేరు. నువ్వు తప్ప వేరెవరూ తలుపు కూడా తెరవలేరు."

– జిడ్డు కృష్ణమూర్తి, ప్రపంచ తత్వవేత్త

# సోలార్ బాధితులకు న్యాయం చేస్తాం

గాలివీడు : సౌర విద్యుత్ ప్లాంట్ ఏర్పాటులో భాగంగా భూములు కోల్పోయిన బాధితులకు తగిన న్యాయం చేస్తామని ఆర్డీఓ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని తూముకుంట గ్రామంలో అదనంగా ఏర్పాటు చేస్తున్న 500 మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్రాజెక్ట్ పనులను ఆయన తహసీల్దార్ భాగ్యలతతో కలసి పరిశీలించి, రైతులతో చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సోలార్ విద్యుత్ అదనపు ఉత్పత్తి ప్లాంట్ ఏర్పాటులో భాగంగా ప్రభుత్వ భూమిలో నిర్మాణం పనులు జరుగుతుండగా కొందరు స్థానికులు పదే పదే అడ్డు తగలడం సరికాదన్నారు. ఆ భూములు వారి అనుభవంలో ఉన్నట్లు ఆధారాలు ఉంటే వారితో చర్చించి వారికి ప్రత్యామ్నాయంగా అసైన్‌మెంట్‌లో భూమిని కేటాయిస్తామన్నారు. ఇదిలా ఉండగా తూముకుంట దిగువమూల, ప్రకాశ్ నగర్ కాలనీ వాసులు తమ అనుభవంలో ఉన్న భూములను సోలార్‌కు కేటాయించడం ద్వారా 40 కుటుంబాలు రోడ్డున పడతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



సోలార్ విద్యుత్ ప్రాజెక్ట్ పనులను పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ భాగ్యలత

**ఆక్రమణలో ఉన్న రేకుల షెడ్లపై చర్యలు తీసుకోండి**

గుర్రాలమిట్ట వద్ద అక్రమంగా ఏర్పాటు చేసిన రేకుల షెడ్లు తొలగింపునకు తగిన చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ శ్రీనివాసులు తహసీల్దార్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ బాలాజీ, ఎస్ఐ రామకృష్ణ, వీఆర్ఓలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

## బాబు, పవన్ కల్యాణ్ దోపిడీదారులకు కాపలాదారులు

రైల్వేకోడూరు అర్బన్ : ఇచ్చిన హామీలను అమలు చేయకుండా చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ ఓ సామాజిక వర్గాన్ని రెచ్చగొట్టారని, అలాగే దోపిడీదారులకు కాపలాదారులుగా ఉన్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జల ఈశ్వరయ్య విమర్శించారు. ఆదివారం రైల్వేకోడూరులో జరిగిన ఏఐటీయూసీ జిల్లా మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ, రాష్ట్రంలో సీఎం చంద్రబాబు కార్మిక వ్యతిరేక చట్టాలను అమలు చేస్తున్నారని తెలిపారు. అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ఉంటే ప్రజల్లో ఆగ్రహం వస్తుందని గమనించి డైవర్షన్ పాలిటిక్స్ కోసం దేవుళ్లను వాడుకొన్నారని విమర్శించారు. పేద, బడుగు, బలహీన, కార్మిక, వర్గాలకు అన్యాయం చేస్తూ పెట్టుబడి, దోపిడీదారులకు కాపలాదారుల్లా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అన్ని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర సహాయ కార్యదర్శి రాజారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగసుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తుమ్మల రాధాక్రిష్ణ, సాంబశివ, నాయకులు గంగాధర్, రాజశేఖర్, పండుగోలు మణి, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గుజ్జల ఈశ్వరయ్య

## కాపర్ వైరు చోరీ చేసిన కానిస్టేబుల్ సస్పెన్షన్

ఖాజీపేట : కంచే చేను మేసిందన్న సామెత చందాన దొంగ సొత్తుకు కాపలా కాయాల్సిన రక్షక భటుడే దాన్ని చోరీ చేశాడు. చివరకు ఉన్నతాధికారులు గుర్తించి క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు. ఖాజీపేట పోలీస్ స్టేషన్‌లో కాపర్ వైర్ చోరీ చేసిన కానిస్టేబుల్ చిన్నయ్యను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ సస్పెండ్ చేశారు. వివరాల్లోకి వెళితే.. ఖాజీపేట మండలంలో 2024లో రెండు ట్రాన్స్ ఫార్మర్లలోని కాపర్ వైర్‌ను దొంగలు చోరీ చేశారు. ఈ సంఘటనపై ఖాజీపేట స్టేషన్‌లో రైతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఖాజీపేట సీఐ మోహన్ దొంగలను పట్టుకుని వారి నుంచి కాపర్ వైర్ రికవరీ చేశారు. 14 కేజీల కాపర్ వైర్‌ను పోలీస్ స్టేషన్ లాకప్‌లో ఉంచారు. లాకప్‌లోని కాపర్ వైర్‌ను తిరిగి కేసులో చూపించాలని ప్రయత్నించిన పోలీసులకు కాపర్ వైర్ కనిపించలేదు. ఈ విషయమై విచారణ జరిపిన సీఐ సీసీ పుటేజీలను పరిశీలించారు. ఈ పరిశీలనలో కానిస్టేబుల్ చిన్నయ్య చోరీ చేసినట్లు గుర్తించారు. అతనిపై శాఖాపరమైన చర్యలకు ఉన్నతాధికారులకు సీఐ నివేదిక పంపారు. ఈమేరకు జిల్లా ఎస్పీ అంతర్గత విచారణ జరిపి కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేశారు.

# ఆపద వేళ అండగా పోస్టల్ బీమా

- తపాలాశాఖ ఖాతాదారులకు ప్రత్యేకం
- రూ.10 లక్షలు, రూ. 15 లక్షలు బీమా పథకాలు
- 18 నుంచి 65 సంవత్సరాల మధ్య వయస్కులు మాత్రమే అర్హులు

ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంకు లోగో

కడప వైఎస్ఆర్ సర్కిల్ : పేద, మధ్య తరగతి వారికి అందుబాటులో ఉండేలా గ్రూప్ యాక్సిడెంట్ గార్డ్ పాలసీని ప్రవేశ పెట్టింది తపాలా శాఖ. రూ.599 ప్రీమియంతో రూ. 10 లక్షలు , రూ.799 ప్రీమియంతో రూ. 15 లక్షలు బీమా పాలసీలను అందుబాటులోకి తెచ్చింది. పాలసీదారుడికి ఎలాంటి ప్రమాదం సంభవించినా బీమా తీసుకున్నప్పటి నుంచి ఏడాది పాటు కవరేజ్ వర్తిస్తుంది. 18 నుంచి 65 ఏళ్ల వయస్కుల వారికి మాత్రమే ఇవి వర్తిస్తాయి. 2022 ఏప్రిల్‌లో తొలిసారిగా తపాలాశాఖ ఈ పథకాలను ప్రవేశ పెట్టింది. ఇప్పటికే కడప డివిజన్‌లో అధిక సంఖ్యలో పాలసీలను తీసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు.

**పాలసీ పొందాలంటే..**

ఈ పాలసీలు పొందాలంటే ముందుగా పోస్టల్ బ్యాంకు ఖాతా కలిగి ఉండాలి. ఖాతా లేనివారు రూ. 200తో నూతనంగా తెరవాలి. బీమా పాలసీకి రూ.599 గానీ, రూ.799 గానీ చెల్లించాలి. ప్రమాదం సంభవిస్తే మాత్రమే ఈ బీమా వర్తిస్తుంది. దీర్ఘకాలిక పక్షవాతం ఉన్నవారికి వర్తించదు. పాలసీ కోసం నగదు చెల్లించిన రోజు అర్ధరాత్రి 12 గంటల నుంచి బీమా రక్షణ లభిస్తుందని అధికారులు తెలిపారు. పాలసీదారులకు ఒక బాండ్ కూడా ఇస్తామన్నారు.

**ప్రయోజనాలివీ..**

- రూ.799, రూ.599 చెల్లిస్తే స్టార్ ఇన్సూరెన్స్ సంస్థ ద్వారా బీమా
- ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.15 లక్షలు, రూ.10 లక్షలు
- శాశ్వత, పాక్షిక వైకల్యం అయితే రూ.15 లక్షలు, రూ.10 లక్షలు
- పిల్లల విద్యా ప్రయోజనం కోసం రూ. 50 వేలు, గృహ స్వస్థత రూ. 7వేలు, రూ. 5వేలు
- ప్రమాదం జరిగితే వైద్య ఖర్చులకు రూ. లక్ష, రూ. 75 వేలు
- హాస్పిటల్ నగదు ప్రయోజనం రోజుకు రూ. వెయ్యి (రూ. 6 వేల వరకు)
- దిగుమతి చేసుకున్న మందులు రవాణా ఖర్చులకు రూ. 14 వేలు, రూ.12 వేలు
- అంబులెన్స్, పార్థివదేహాన్ని తరలించేందుకు రవాణా ఖర్చులు రూ. 11 వేలు, రూ. 9 వేలు
- ఒక బంధువు ప్రయాణ ఖర్చు రూ. 11 వేలు, రూ. 9 వేలు
- అంత్యక్రియల ఖర్చులు రూ. 9 వేలు, రూ. 7 వేలు అన్‌లిమిటెడ్ టెలికన్సల్టెన్సీ
- ప్రమాదం ఏ విధంగా జరిగినా పాలసీ కచ్చితంగా వర్తించేలా నిబంధనలు రూపొందించారు.

## న్యాయవాదిపై దాడి

ప్రొద్దుటూరు క్రైం : మండలంలోని దొరసానిపల్లెకు చెందిన న్యాయవాది నల్లగారి పద్మనాభరెడ్డి, ఆయన కుమారుడు తమ్మిరెడ్డిలపై కొందరు వ్యక్తులు దాడి చేశారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. జింకా మూర్తి, జింకా సాగర్‌తో పాటు కొందరు వ్యక్తులు జీఎస్టీ స్కాం చేస్తున్నారని పద్మనాభరెడ్డి జీఎస్టీ అధికారులకు సమాచారం అందించారు. దీంతో కోపం పెంచుకున్న జింకా మూర్తి, జింకా సాగర్, నాగరాజు, శివప్రసాద్ అనే వ్యక్తులు పద్మనాభరెడ్డి ఇంటికి వెళ్లి దాడి చేశారు.



# వెంటాడుతున్న చిరుత భయం

- తుమ్మలపల్లె సమీపంలో చిరుత పిల్ల సంచారం
- పట్టించుకోని అటవీ అధికారులు
- భయాందోళనలో గ్రామస్తులు

పులివెందుల రూరల్ : పులివెందుల మండల పరిధిలోని తుమ్మలపల్లె గ్రామ సమీపంలో ఆదివారం చిరుత పిల్ల కనిపించినట్లు గ్రామస్తులు తెలిపారు. చిరుతలు సంచరిస్తున్నాయని వారు భయాందోళన చెందుతున్నారు. గత 30 రోజులుగా చిరుత, వాటి పిల్లలు లింగాల, పులివెందుల, సింహాద్రిపురం మండలాల్లోని గ్రామాల్లో సంచరిస్తున్న విషయం విదితమే. లింగాల, పులివెందుల మండలాల్లో ప్రతి రోజు ఏదో ఒక గ్రామంలో చిరుత అడుగులు, చిరుత పిల్లలు కనిపిస్తూనే ఉన్నాయి. సంబంధిత అధికారులు మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారే తప్పా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

**ప్రాణాలు పోయే వరకు స్పందించరా..**

సింహాద్రిపురం, లింగాల, పులివెందుల మండలాల్లో చిరుతలు సంచరిస్తున్నాయని ఫారెస్టు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు ఏమాత్రం స్పందించకపోవడంపై ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మా ప్రాణాలు పోయేంత వరకు అధికారులు మీరు స్పందించరా అని ప్రశ్నిస్తున్నారు. ఆదివారం పులివెందుల మండల పరిధిలోని తుమ్మలపల్లె గ్రామ సమీపంలో నూగు పంటలో చిరుత పిల్ల కనిపించిందని గ్రామానికి చెందిన గంగిరెడ్డి తెలిపారు అలాగే లింగాల మండల కేంద్ర సమీపంలో చిరుత అడుగు జాడలు కనిపించాయని స్థానికులు చెబుతున్నారు. అటవీ అధికారులు ఇంకా ఇలాగే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే జంతువుల ప్రాణాలకే కాదు ప్రజల ప్రాణాలకు కూడా ప్రమాదం పొంచి ఉందని గ్రామస్తులు బిక్కుబిక్కుమంటున్నారు. ఇన్ని ఆధారాలు చూపిస్తున్నా అటవీ అధికారుల దాటవేత వైఖరికి కారణమేంటో అర్థం కావడం లేదు. ఇప్పటికైనా వారు స్పందిస్తారా.. ఇదే నిర్లక్ష్యాన్ని కొనసాగిస్తారో వేచి చూడాల్సిందే.



లింగాలలో చిరుత అడుగులు



చిరుత పిల్లను చూశానని చెబుతున్న తుమ్మలపల్లె గ్రామస్తుడు

**లింగాలలో పులి అడుగుజాడలు**

లింగాల : మండల కేంద్రమైన లింగాలలో చిరుత పులుల అడుగుజాడలు కనిపించాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండల కేంద్రంలోని చౌడమ్మ పొలాల్లో ఆదివారం ఒక చిరుత పులి, రెండు చిరుత పులి పిల్లల అడుగుజాడలు కనిపించాయని గ్రామస్తులు తెలిపారు. అలాగే గ్రామానికి చెందిన వాసుదేవ రెడ్డి అనే రైతు పొలంలోని అరటి తోటలో కూడా అడుగుజాడలు కనిపించాయన్నారు. పులులు సంచరిస్తున్నట్లు సమాచారం ఇవ్వడంతో ఆదివారం సాయంత్రం ఫారెస్ట్ అధికారి మహబూబ్ బాషా పరిశీలించారు. రైతులందరూ జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు.



చిరుత పిల్ల కనిపించిన నూగు పంట



మాట్లాడుతున్న సీఐ రమణ

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

పులివెందుల రూరల్ : పులివెందుల, లింగాల, సింహాద్రిపురం మండలాల్లోని రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రూరల్ సీఐ రమణ తెలిపారు. ఆదివారం ఆయన పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సింహాద్రిపురం మండలం రామాపురం, బలపనూరు గ్రామాల శివారు ప్రాంతాలలో 10 రోజుల క్రితం విద్యుత్ తీగలు తగులుకుని మగ చిరుత మృతి చెందింది. దీంతో ఆడ చిరుతతో పాటు రెండు పిల్లలు సింహాద్రిపురం, లింగాల మండలాల్లోని పలు గ్రామాలలో సంచరిస్తున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. తోటల వద్దకు వెళ్లే రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. చిరుతలు సంచరించే గ్రామాలలో ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. ఎక్కడైనా చిరుతలు కనిపిస్తే వెంటనే సంబంధిత ఫారెస్ట్ అధికారులకు లేదా పోలీసులకు సమాచారం అందించాలన్నారు.